ప్రపంచ ప్రఖ్యాత నవ

# అజేయుడు

## The Count of Monte Cristo



అలెగ్జాండర్ ద్యూమా

# అజేయుడు

**(The Count of Monte Cristo)**

*మూలం :*

**అలెగ్జాండర్ ద్యుమా**

**సూరంపూడి సీతారాం**

**హైదరాబాద్ బుక్ ట్రస్ట్**


| | | |
|---|---|---|
| ధర | : | రూ. 160/– |
| మొదటి ముద్రణ | : | ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక నుండి సీరియల్‌గా వచ్చి, తరువాత ఆంధ్ర గ్రంథమాల, చెన్నై, 1951లో ప్రచురించబడినది. |
| HBT తొలి ముద్రణ | : | ఏప్రిల్, 2011 |
| ప్రతులకు, వివరాలకు | : | హైదరాబాద్ బుక్ ట్రస్ట్,<br>ప్లాట్ నెం. 85, బాలాజీనగర్<br>గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 067<br>ఫోన్ : 23521849<br>www.hyderabadbooktrust.blogspot.com |
| ముద్రణ | : | అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,<br>126, శాంతినగర్, హైదరాబాద్ – 28<br>ఫోన్ : 23391364, 23304194<br>Email: anupamaprinters@yahoo.co.in |

# ముందుమాట

ఫ్రెంచి నవలా రచయిత, నాటక కర్త అయిన అలెగ్జాండర్ ద్యూమా రాసిన అద్భుత నవల... ద కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో. ఈ నవల కథ చరిత్ర, రాజకీయాలతో ముడిపడింది. ఇందులో చాలా సంఘటనలు వాస్తవాధారితాలు. ఫ్రెంచి రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన నెపోలియన్ కూడా ఈ నవల్లో ప్రధాన పాత్రధారి. కాని అంతా పరోక్షంగానే. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం... ఫ్రెంచి విప్లవం కారణంగా వచ్చిన మానవీయ విలువలు ఈ నవలలో స్పష్టంగా కనిపిస్తాయి. స్వతహాగా ఈ విలువలపట్ల ఎంతో విశ్వాసం ఉన్న ద్యూమా... నవలలో అంతర్లీనంగా అవి కన్పించేలా కథనాన్ని చాలా చక్కగా మలిచారు. 19వ శతాబ్దిలో జరిగిన యథార్థ ఘటనలే ఈ నవలకు స్ఫూర్తి. ఈ విషయాన్ని ద్యూమానే స్వయంగా రాసుకున్నారు. జాక్విస్ ప్యూచె అనే వ్యక్తి తన ఆత్మకథలో కొన్ని ఘటనలను ప్రస్తావించాడు. అందులో ముఖ్యమైంది పికో అనే వ్యక్తి ప్రస్తావన. 1807 ప్రాంతంలో పారిస్‌కు చెందిన ఫ్రాంకోయిస్ పికో అనే వ్యక్తి జీవితంలో చోటుచేసుకున్న ఘటనలు ఆసక్తికరంగా ఉంటాయి. పేదవాడైన పికోకి ధనవంతురాలైన యువతితో పెళ్ళి నిశ్చయమవుతుంది. అసూయపరులైన స్నేహితులు అతడిపై ఇంగ్లండ్ గూఢచారి అని ఆరోపణ చేస్తారు. దాంతో అతను జైలు పాలౌతాడు. అక్కడ తోటి ఖైదీ తాను దాచిన నిధి గురించి చెప్తాడు. పికో విడుదల కాగానే ఆ నిధి తీసుకుని మారుపేరుతో సొంత ఊరికి వస్తాడు. పదేళ్ళపాటు ప్రణాళికలు రచించి శత్రువులపై పగతీర్చుకుంటాడు. ఈ కథ స్ఫూర్తితోనే ద్యూమా ద కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో నవల రాశారు. సీరియల్‌గా వచ్చిన ఈ నవలకు విపరీత ప్రజాదరణ లభించింది. సీరియల్ తదుపరి భాగం కోసం జనం దుకాణాల దగ్గర బారులు తీరేవారు. నవలకు ఎంత ఆదరణ లభించిందంటే కొద్ది నెలల్లోనే పది భాషల్లోకి అనువాదమైంది. 1846లో వెలువడిన తొలి ఆంగ్ల ముద్రణ కూడా బహుళ పాఠకాదరణ పొందింది. దాంతో అలెగ్జాండర్ ద్యూమా పేరు ప్రపంచమంతటా మార్మోగింది.

శతాబ్దాల కాలం గడిచినా... నేటికీ ఈ నవలపట్ల పాఠకుల ఆదరణ చెక్కుచెదర లేదు. సమాజంలో సంస్కృతుల మధ్య, విలువల మధ్య తీవ్ర అంతరం వచ్చినా... నవలని అప్పట్లో ఎంతగా ఆస్వాదించారో, నేటి పాఠకులూ అంతగా ఆస్వాదిస్తున్నారు. ఈ నవల ఆధారంగా ఐదు సినిమాలు వచ్చాయి. సంగీత, రేడియో రూపకాలకైతే లెక్కేలేదు. 'ది అబ్జర్వర్' పత్రిక సాహితీ సంపాదకుడు రాబర్ట్ మెక్‌క్రమ్ వంద ప్రముఖ రచనల జాబితా సిద్ధం చేశారు. అందులో ద కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టోకి 14వ స్థానం ఇచ్చారు. అయితే ఈ నవలకు సాహితీవేత్తలు మాత్రం తగినంత ప్రాముఖ్యం ఇవ్వలేదు. సాధారణ స్థాయికి కాస్త పై స్థాయిలో చక్కని కథా వస్తువుతో సాగే సాహస నవలగా మాత్రమే పరిగణించారు.

65 ఏళ్ళ క్రితం దీన్ని సూరంపూడి సీతారాం తెలుగులోకి అనువదించారు. అప్పట్లో అది 730 పేజీలు. పాఠకాసక్తి, సమయం, ధరలను దృష్టిలో పెట్టుకుని ఈ నవలను క్లుప్తీకరించి మేము పునర్ముద్రిస్తున్నాం. ఈ పుస్తకాన్ని అమితంగా ప్రేమించి ఈ పునర్ముద్రణకు ప్రోత్సాహాన్ని, సహకారాన్ని అందించిన వై. రామమోహన్‌రావుకు ధన్యవాదాలు.

**హైదరాబాద్ బుక్ ట్రస్ట్,**

ఏప్రిల్, 2011

1815, ఫిబ్రవరి 24. 'ఫెరౌ' నౌక మార్సేయ్ రేవులో ప్రవేశిస్తున్నది. నోటర్‌డామ్ గోపుర శిఖరం అనుమతి సంకేతమిచ్చింది. ఎప్పటిలాగే రేవునుంచి ఒక పైలట్ వెంటనే బయలుదేరాడు. చిన్న బోటులో ఈఫ్‌కోటను చుట్టి, 'మార్గియన్' అగ్రానికీ 'రయన్' ద్వీపానికీ మధ్య నౌకనందుకొన్నాడు. చూడవచ్చిన జనం కిటకిటలాడుతున్నారు. ఒక నౌక వచ్చిందంటే ఆనాడు మార్సేయ్ నగరవాసులకు పండుగన్నమాటే.

నౌక మెల్లిగా రేవులో ప్రవేశిస్తున్నది. 'కెలరీన్' ద్వీపానికీ 'యారోస్' ద్వీపానికీ మధ్య సింధుశాఖను జాగ్రత్తగా దాటింది. నౌక గమనం నిర్దుష్టంగా, లంగరు దిగడానికి సిద్ధంగా ఉంది. పైలట్ సమీపంలో ఒక యువకుడు నిలిచి నౌక గమనాన్ని శ్రద్ధతో పరికించడానికి పైలట్ ఆజ్ఞలను పునరుచ్చరిస్తున్నాడు. చూడవచ్చినవారిలో జాప్యం సహించలేని ఒకడు చిన్న బోటులోకి దుమికి నౌక దిక్కుగా వెళ్ళాడు. 'రిజర్వ్' సింధు శాఖవద్ద నౌకను సమీపించాడు. నౌకపై యువకుడు ముందుకు వచ్చి, బోటులో వ్యక్తిని సమాశ్వాసించాడు. యువకుని వయస్సు ఇరవైఏళ్లలోపు ఉండవచ్చు. పొడగరి, బక్కపలుచని శరీరం, నల్లని నేత్రాలు, శైశవం నుంచీ భీతి అంటే తెలియని స్థైర్య భావం అతని ముఖంలో ఉట్టిపడుతోంది.

"నువ్వా డాంటీ?" అన్నాడు బోటులో వ్యక్తి. "ఏం జరిగిందోయ్? ఈ విషాద సూచన లేమిటి?"

"పెద్ద దుర్ఘటన సంభవించిందండీ, మోరెల్, మన కెప్టెన్ లక్లేర్ మృతిచెందాడు."

"మరి ఓడలో సరుకు?"

"క్షేమంగానే చేరింది. ఆ విషయమై మీరు బెంగపడనక్కర లేదు కాని పాపం మన కెప్టెన్ ...."

బెంగ తీరిన ఓడ యజమాని అర్ధోక్తిలోనే ప్రశ్న అందుకున్నాడు. "ఎల్లా పోయాడోయ్? జబ్బేమిటి?"

"మస్తిష్కజ్వరంతో యాతనపడి మరణించాడండి" అని చెప్పి, యువకుడు వెనక్కి తిరిగి నావికులను పిలిచాడు; " రేవు చేర్చడానికి అంతా సిద్ధపడండి" నావికులు ఆజ్ఞపాలించారు. యువకుడు తిరిగి మోరెల్‌తో ప్రసంగం అందుకున్నాడు.యజమాని ప్రశ్నించాడు – "అసలిది ఎలా సంభవించింది?"

"ఏం చెప్పనండి? అంతా ఆశ్చర్యంగా జరిగింది. నేపుల్స్ విడిచిపెట్టే ముందు నౌకాశ్రయ సర్వాధికారితో కెప్టెన్ లక్లేర్ చాలా సేపు మాట్లాడాడు. తరువాత కలవరపడినట్లు కనిపించాడు. అంతే, జ్వరం ముంచుకొచ్చింది. మూడు రోజుల్లో చనిపోయాడు. శవాన్ని ఒక వలసంచిలో చుట్టి తలవంకనూ, కాళ్లవంకనూ ఇనుపగుళ్ళు కట్టి, ఎల్ గిగ్లియో వద్ద సముద్రంలో విడిచిపెట్టాం. వితంతువుకు ఒప్పగించడానికి పవిత్రమైన సిలువ, కత్తి తెచ్చాం. ఆంగ్లేయులతో పదేళ్లు పోరాడిన వీరుడు, ఈ రీతిగా సామాన్యులవలె మృతిచెందడం చూస్తే...." యువకుడు విషాదభరితమైన చిరునవ్వు నవ్వాడు.

ఓడ యజమాని అన్నాడు – "అవును, ఎడ్మండ్, మనం అంతా మర్త్యులం. యువకులకు తావిచ్చి వృద్ధులు తప్పుకోడం మానవ ధర్మం. లేకపోతే వృద్ధికి అవకాశమే ఉండదు. ఓడలో సరుకంతా క్షేమంగా చేరిందని నువ్వు హామీ ఇస్తున్నావు కాబట్టి....."

"అవును, అంతా యథాస్థితిలో ఉంది మోరెల్. బాధ్యత నాది. ప్రయాణంలో వచ్చిన వెయ్యిపౌనుల లాభాన్ని తీసుకోవద్దని మీకు నా సలహా. మీరు ఓడయెక్కి వచ్చినట్లయితే, సరుకు అజమాయిషీ చేసే డాంగ్లర్ మీకు అవసరమైన విషయాలన్నీ చెప్పగలడు. నేను ఈ లోగా లంగరు వేయిస్తాను."

డాంటీ విసిరిన పగ్గం పట్టుకుని సునాయాసంగా ఓడ యెక్కాడు యజమాని. యువకుడు యథాస్థానం చేరాడు. డాంగ్లర్ వచ్చి యజమానిని కలుసుకున్నాడు. డాంగ్లర్‌కి ఇరవై అయిదేళ్ళుండవచ్చు. అంత ఆకర్షణీయమైన రూపం కాదు. పెద్ద ఉద్యోగులపట్ల అతివినయం, క్రిందివారిపట్ల ధూర్తతవల్ల నావికులలో పరపతి లేనివాడు. డాంటీపట్ల నావికుల కెంత ప్రేమో, డాంగ్లర్‌పట్ల వారికంత అసహ్యం.

"మోరెల్, మీరీ విషాదవార్త విన్నారా?" అన్నాడు డాంగ్లర్.

"అవునవును, విన్నాను. పాపం లక్లేర్, వీరుడు, విశుద్ధవర్తనుడు."

"అనుభవజ్ఞుడైన నావికుడు కూడా. మోరెల్ అండ్ సన్ వంటి కంపెనీలో బాధ్యత వహించడం అంటే, అటువంటి అనుభవజ్ఞుడే కావాలి" అన్నాడు డాంగ్లర్. డాంటీవంక చూపులు నిగిడ్చి యజమాని అన్నాడు; "వృద్ధుడైతే గాని, నావికునికి పని తెలియదనడం సరికాదు డాంగ్లర్. మన ఎడ్మండ్ చూడు, ఎవరి సహాయం అక్కర్లేకుండా పని చెయ్యగలడనిపిస్తుంది."

డాంగ్లర్ మాత్సర్యంతో డాంటీవంక పక్క చూపులు చూస్తూ అన్నాడు – "అవును, అతను యువకుడు, యువకులకు ఆత్మవిశ్వాసం అధికం. కెప్టెన్ చనిపోయాడో లేదో, బాధ్యతంతా పైన వేసుకున్నాడు. వెంటనే మార్సేయ్‌కు తిరిగిరావటానికి బదులు 'ఎల్బా' ద్వీపంలో రోజున్నర గడిపాడు."

"బాధ్యతంతా పైన వేసుకొన్నాడంటే 'మేట్'గా అది అతని విధి. కాని ఓడ మరమ్మతు అవసరమైతే తప్ప, ఎల్బా ద్వీపంలో రోజున్నర జాప్యంచెయ్యటం తప్పే."

"ఓడ నిక్షేపంలా ఉంది. కేవలం లోభంవల్ల, కులాసాగా గడపడానికి, రోజున్నర పాడుచేశాడు."

"డాంటీ!" అని పిలిచాడు ఓడ యజమాని, "ఒక మాటిలారా!"

"క్షమించాలండి, క్షణంలో వస్తున్నాను" అని జవాబిచ్చి డాంటీ "లంగరు దించండి" అని నావికులకు కేక పెట్టాడు. వెంటనే లంగరు దిగింది, ఇనుపగొలుసులు పెద్ద రొద చేస్తూ దిగాయి. లంగరు పడిన తరువాత "జండా సగమెత్తు దించండి. రేవుకు నిచ్చెనలు వేయండి" అని కేకపెట్టాడు డాంటీ.



"అబ్బో! అప్పుడే కెప్టెన్ అయిపోయాననుకుంటున్నాడు చూడండి" అన్నాడు డాంగ్లర్.

డాంటీ సమీపించాడు, "లంగరు వేసేశారు, ఇంక సెలవివ్వండి". డాంగ్లర్ ఒక అడుగు వెనక్కి ఒదిగాడు. "ఎల్బా దగ్గర ఆలస్యమెందుకు చేశావో చెప్పు నాకు?"

"నాకు తెలియదండి, అది కెప్టెన్ లక్లేర్ తుది ఆజ్ఞ. గ్రాండ్ మార్షల్ బెర్‌ట్రండ్‌కి ఇవ్వాలంటూ ఒక బంగీ నా చేతికిచ్చారు చనిపోయేముందు."

"అయితే గ్రాండ్ మార్షల్‌ని చూశావన్నమాట?" మోరెల్ కంగారుగా ముందూ వెనకా చూశాడు. డాంటీని పక్కకు తీసుకెళ్లి మెల్లిగా ప్రశ్నించాడు. "చక్రవర్తి ఎలా ఉన్నారు?".

"నేను వెళ్లినప్పుడే మార్షల్ వద్ద ఆయన ఉన్నారు. ఓడని గురించి నన్ను ప్రశ్నలడిగారు. మార్సేయ్ నించి ఎప్పుడు ప్రయాణమైనదీ, ఏమేమి సరుకు తీసుకువెళ్లినదీ అడిగారు. ఓడలో సరుకు లేకపోయి, నేనే ఓడ యజమానినైతే, తప్పకుండా ఆయన ఓడని కొనేసేవారని నా నమ్మకం. కాని నేను మేట్‌ని మాత్రమేనని ఆయనకి నివేదించాను. ఓడ మోరెల్ అండ్ సన్‌కు చెందినదని చెప్పాను. 'అల్లాగా' అన్నారాయన. 'నాకు తెలుసు, మోరెల్ వంశస్థులు పారంపర్య ఓడయజమానులు. ఆ వంశంలో ఒకరు వాలెన్స్‌లో నాతోపాటు సైన్యంలో ఉండేవారు కూడా అన్నారు."

యజమాని ఆనందభరితుడైనాడు. "నిజంగా? ఈశ్వర కృప సుమా! అతనిపేరు 'పాలికర్ మోరెల్' మా పినతండ్రి. తరువాత కెప్టెన్ అయినాడు. డాంటీ! ఈ మాట నువ్వు మా పినతండ్రికి తప్పకుండా చెప్పాలి; చక్రవర్తికి ఇంకా అతను జ్ఞప్తిలో ఉన్నాడని. నువ్వే చూడు. ఇది వింటే ఏడ్చేస్తాడు." స్నేహభావంతో యువకుని జబ్బలు రెండుచేతులా పట్టుకుని మళ్లీ అన్నాడు. "నిజమే, నువ్వు చేసింది మంచిదే డాంటీ. లక్లేర్ ఆజ్ఞ పాలించడం మంచిదే అయింది. కాని నువ్వు ఒక బంగీ గ్రాండ్‌మార్షల్‌కి ఇచ్చినట్లుగాని, చక్రవర్తితో మాట్లాడినట్లుగాని పైకి పొక్కిందంటే నీకు క్షేమం కాదు."

"అదెల్లాగండీ? నేనిచ్చిన బంగీలో ఏముందో నాకు తెలియదు. ఏ ఇతర అపరిచిత వ్యక్తినైనా ప్రశ్నించే విధంగానే, నన్నూ చక్రవర్తి ప్రశ్నించారు. అంతే, ఇదిగో, తనిఖీ ఆఫీసర్లు వస్తున్నారు. ఒక్క క్షణం మన్నించండి" అంటూ డాంటీ వెళ్లిపోయాడు. అతను వెళ్లిందే తడవు డాంగ్లర్ సమీపించాడు.

"ఇంకేం? ఫెరాజో రేవులో లంగరెందుకు వేశాడో మంచి కారణాలు చెప్పాడన్నమాట?"

"అవును, మంచి కారణాలే డాంగ్లర్, అది కెప్టెన్ లక్లేర్ ఆజ్ఞ."

"అన్నట్టు, కెప్టెన్ లక్లేర్ అంటే జ్ఞాపకం వచ్చింది. మీకిమ్మని ఆయనిచ్చిన ఉత్తరం ఒప్పగించాడా?"

"నాకు ఉత్తరమా? లేదే? అతని దగ్గరుందా?"

"బంగీ కాక, ఒక ఉత్తరం కూడా కెప్టెన్ లక్లేర్ ఇచ్చాడనుకున్నాను."

"బంగీ ఏమిటి డాంగ్లర్?"

"ఫెరాజో రేవులో ఒప్పగించి ఉండాలి, ఆ బంగీని."

"కాని ఫెరాజో రేవులో ఒప్పగించడానికి బంగీఒకటి డాంటీ దగ్గరుందని నీ కెలా తెలుసు?"

డాంగ్లర్ ముఖం ఎర్రబడింది. "నేను అప్పుడే కెప్టెన్ గది దాటి వెడుతున్నాను. తలుపు ఓరగా ఉంది. బంగీ ఒకటి, ఉత్తరం ఒకటి డాంటీకి కెప్టెన్ ఇవ్వడం కనపడింది."

"నాకు ఉత్తరం సంగతేమీ డాంటీ చెప్పలేదు. ఏదైనా ఉత్తరం ఉంటే నాకిచ్చేవాడే!"

డాంగ్లర్ ఒక్క క్షణం ఆలోచించి "క్షమించాలి మోరెల్. అదేమీ డాంటీని అడక్కండి. నేను పొరబడి ఉండవచ్చు." అప్పటికి యువకుడు అక్కడికి చేరాడు. డాంగ్లర్ వెళ్లిపోయాడు.

"చూడు డాంటీ! నీ పనంతా పూర్తి అయినట్టేనా? ఇంక చెయ్యవలసిందేదీ లేదు కదా?"

"లేదండి, అంతా పూర్తి అయింది."

"సరే అయితే. నువ్వీ రాత్రి మాయింటికి విందుకి రాగలవా?"

"క్షమించాలండి మోరెల్, నేను ముందు వెళ్లి నాతండ్రిని చూడాలి. మీ ఆదరానికి చాలా కృతజ్ఞుణ్ని."

కొంచెం సంకోచిస్తూ డాంటీ ప్రశ్నించాడు. "నా తండ్రి ఎలా వున్నాడో మీకేమైనా తెలుసా?"

"ఆ – క్షేమంగానే ఉన్నాడనుకుంటాను. ఆయన్ని నేనంతగా చూడ్డం లేదనుకో."

"అవును, ఆయన గది విడిచి కదలడు."

"దాన్ని బట్టే అనుకున్నాను, ఎవరిసహాయం అవసరం లేకపోయిందని. చూసి తిరిగి వస్తావుగా?"

"క్షమించాలి, తరువాత మరొకచోటికి వెళ్లాలి. ఆలస్యం చెయ్యడానికి మనస్కరించడం లేదు."

"ఓహో! అదా? నేను మరిచిపోయాను డాంటీ. కాటలన్స్ నివాసంలో నీకోసం ఒకరు నిరీక్షిస్తూ ఉంటారు కాబోలు, ఎవరు? మర్సిదాయేనా?" డాంటీ మందహాసం చేశాడు.

"ఓహ్హోహో!" అంటూ మోరెల్ బిగ్గరగా నవ్వాడు. "ఇప్పుడు తెలిసింది. ఆమె నావద్దకు మూడుసార్లు వచ్చి ఫెరో నౌక గురించి బెంగతో ఎందుకడిగిందో అనుకున్నాను. అవును ఎడ్మండ్, నిన్నింక నిలవరించకూడదు. నీకింక విశ్రాంతినివ్వడం నా ధర్మం. డబ్బేమైనా కావాలా?"

"ఒద్దండి, ప్రయాణంలో తీసుకున్న మూడు మాసాల జీతం డబ్బుంది నాదగ్గర."



"జాగ్రత్త పరుడవే! ఇంక వెళ్లు ఎడ్మండ్. నీ తండ్రిని చూడు. నాకూ కుమారుడొకడున్నాడు. మూడు మాసాలు సముద్ర సంచారం చేసి వచ్చిన తరువాత, త్వరపడి నావద్దకు రాకపోతే నే విసిగిపోనూ? వెళ్లింక. ఇంక నాకు చెప్పవలసిందేమీ లేదుగా?"

"లేదండి"

"కెప్టెన్ లక్లేర్ చనిపోయేముందు నాకోసం ఉత్తరమేదీ ఇవ్వలేదా?"

"అసలాయన అప్పుడు వ్రాయలేని స్థితిలో ఉన్నాడండి. అన్నట్టు మరిచాను. పదిహేనురోజులు సెలవు అడగాలనుకున్నాను."

"ఓ! పెళ్లిచేసుకోడానికా?"

"అవునండి, ఆ తరువాత పారిస్ వెళ్లాలి."

"నీకు కావలసినన్ని రోజులు సెలవు తీసుకో డాంటీ. మూడు మాసాల వరకూ ఓడ బయలుదేరదు. ఆలోగా మాత్రం తిరిగిరా. ఎందుకంటే కెప్టెన్ లేకుండా ఫెరో కదలదుగా!"

"కెప్టెనా!" అన్నాడు డాంటీ. ఆనందం, ఆశ్చర్యం అతన్ని ముప్పిరిగొన్నాయి. "నిజంగానే నన్ను ఫెరో కెప్టెన్‌గా నియమిస్తారా?"

"అంతా నాచేతిలోనే ఉంటే, వెంటనే నిశ్చయించి చెప్పేసేవాడిని డాంటీ. కాని నాతో వాటాదారుకూడా ఉన్నాడుగా! అయినా వ్యవహారం సగభాగం నిర్ణయమైనట్లే భావించుకోవచ్చు నా సమ్మతిని బట్టి. నే చేయగలిగినంత నీకోసం చేస్తాను, రెండో పక్షం చేత సమ్మతింపచెయ్యడానికి."

"నిజమేనా మోరెల్?" యజమానిచేతిని తన రెండు చేతులు పట్టుకొని అన్నాడు– "మీకు చాలా కృతజ్ఞుణ్ణి, ఇదివింటే నా తండ్రీ, మర్సిదా కూడా చాలా ఆనందిస్తారు."

"మంచివాళ్ళనెప్పుడూ పైన భగవంతుడు కనిపెడుతూ ఉంటాడు నాయనా, నువ్వింక నీ తండ్రి దగ్గరకూ, మర్సిదా సమక్షానికీ వెళ్లి తిరిగిరా. నేనింక ఉంటాను. డాంగ్లర్‌తో వ్యవహారం ఇంక తేల్చుకోవాలి. ప్రయాణంలో అతను నీతో సఖ్యతగా ఉన్నాడా?"

"అయ్యా! జవాబు మీ ప్రశ్నలోని ఆంతర్యాన్ని బట్టి ఉంటుంది. చేదోడుగా ఉన్నాడా అనడిగితే, అంతగా చెప్పలేను. నేనంటే అతనికెప్పుడూ ఇష్టం లేదు. 'మాంట్ క్రిస్టో' ద్వీపం వద్ద పదినిమిషాలు ఆగాలని నేనన్నప్పుడు అతను వద్దన్నాడు. అది నిజంగా చిలిపి తగువేనని ఒప్పుకుంటాను. ఇంక మీ సరుకు అజమాయిషీ ఎలా చేశాడని ప్రశ్నిస్తే, అతని కర్తవ్యాన్ని తృప్తికరంగానే నెరవేర్చాడని చెప్పాలి."

"నువ్వే ఫెరో నౌకకు కెప్టెన్ అయితే, డాంగ్లర్‌తో కలిసి ఉండడం నీకు అంగీకారమేనా?"

"నేను కెప్టెన్‌గా ఉన్నాసరే, మేట్‌గానే ఉన్నాసరే, యజమానులు నమ్మిన ఉద్యోగులే ఉండాలని నా అభిప్రాయం. వారిని నేను మన్నిస్తాను."

"శబాష్, డాంటీ! నువ్వు ముక్కుకి సూటిగా వెడతావ్. ఇంక వెళ్లు, ఇంక ఆలస్యం చెయ్యడం నాకిష్టం లేదు. నువ్వూ తొందరపడుతున్నావ్."

"సెలవివ్వండి మోరెల్, చాలా కృతజ్ఞుణ్ణి, మీకు వెయ్యి నమస్కారాలు."

యువకుడు ఉత్సాహంతో బోటులోకి దుమికాడు. 'కానిబయర్' దిక్కుగా నడపాలని నావికునికి ఆజ్ఞ ఇచ్చాడు. ఓడ యజమాని చిరునవ్వుతో బోటులోని యువకుని పరికించాడు. బోటు తీరం చేరింది. యువకుడు ఒక్క ఉదుటున ఒడ్డు పైకి లంఘించాడు. క్షణాల్లో జనసమూహంలో కలిసి అదృశ్యమైనాడు. 'కానిబయర్' వద్ద జనం గుంపులు గుంపులుగా చేరి ఉత్సాహంగా కాలం గడుపుతారు. పారిస్ నగరంలో ఇలాటిదే ఉంటే, మార్సేయ్ నగరంతో పోటీ చెయ్యగలిగేదని కొందరంటారు.

ఓడయజమాని వెనుతిరిగి చూసే సరికి డాంగ్లర్ కనిపించాడు. ఆజ్ఞకోసం నిరీక్షిస్తున్నట్లు నిలిచాడు. కాని వాస్తవానికి ఎడ్మండ్ డాంటీ వంక అసూయతో చూస్తున్నాడు. ఆ యువకుని పరికిస్తున్న ఇద్దరు వ్యక్తుల ముఖాలలోనూ భిన్న భావాలు వ్యక్తమైనాయి.

## 2

'కానిబయర్' మేరంతా నడిచి, నొవాలీ వీధిలో ఒక చిన్న గృహం ప్రవేశించాడు డాంటీ. అది డాంటీ తండ్రి నివాసం. ఫెరౌ నౌక వచ్చిన వార్త వృద్ధునికింకా తెలియలేదు. ఎత్తు కుర్చీ ఒకటెక్కి , కిటికీ ఊచలపై పాకుతున్న పూలతీగెల్ని సవరిస్తున్నాడు. "బాబా! బాబా!" వృద్ధునికి పరిచితకంఠం మధురంగా వినవచ్చింది. వృద్ధుడొక్క కేకతో వెనుతిరిగి చూసి కుర్చీదిగాడు. చూడగానే అతని చేతులలో వాలిపోయాడు. కుమారుడు ఆక్రందన స్వరంతో అన్నాడు. "ఏమిటిది బాబా? జబ్బుగా ఉన్నావా?"

"లేదు నాయనా, లేదు, అనుకోకుండా నిన్ను చూడ్డంతో.... అమ్మయ్య? ఈశ్వరా! ఇంక నిశ్చింతగా చనిపోగలననిపిస్తోంది."

"అదేమిటి బాబా? నువ్వు కొంచెం స్థిమితపడు. నేను తిరిగి వచ్చాను. మనం హాయిగా ఉందాం."

"అవును నాయనా, అలాగే, కాని నువ్వు మళ్లీ నన్ను విడిచి వెళ్లిపోకుండా ఉంటే కదా మనం హాయిగా ఉండడం? చెప్పు? నిజం చెప్పు నాయనా?"

"ఒకరికి దుఃఖం కలిగించేది నాకు అదృష్టప్రాయమై నేను ఆనందిస్తే, కృపామయుడు నన్ను క్షమించాలి, కాని ఏం చెయ్యను? అదృష్టం కలిసివచ్చింది. కెప్టెన్ లక్లేర్ చనిపోయాడు బాబా. మోరెల్ సహాయంతో నాకా ఉద్యోగం దొరకవచ్చును, చూడు బాబా! ఇరవయ్యోఏట కెప్టెన్! నూరు లూయీల వేతనం, లాభాలలో పాలు. నావంటి పేదనావికుడు కలనైనా కనలేని మహద్భాగ్యం కాదూ?"

"అవును నాయనా, అవును, అది అదృష్టం!" అన్నాడు వృద్ధుడు.



"నాకు వచ్చే మొట్టమొదటి జీతంతో తోటమధ్య చిన్న ఇల్లు కొంటాను. ఆ తోటలో నీ యిష్టం వచ్చినన్ని పూలతీగలు వేసుకోవచ్చు. కాని నువ్వంత జబ్బుపడినట్టు కనిపిస్తున్నావేమిటి చెప్పు బాబా?"

"అబ్బే, ఏమీ లేదు నాయనా" అంటూనే, సత్తువ ఉడిగిపోయిన వృద్ధుడు వెనక్కి ఒరిగిపోయాడు.

"చూడు బాబా, చూడు, ఉండు ఒక గ్లాసు ద్రాక్షరసం పుచ్చుకుందువుగాని. కొంచెం తేరుకుంటావు. అది ఎక్కడ పెట్టావు?'' అంటూ డాంటీ గదిలో వెతకనారంభించాడు.

"లాభం లేదు నాయనా, ద్రాక్షరసం లేదు."

"ఏమిటి? ద్రాక్షరసం లేదా?" డాంటీ తెల్లబోయి, పాలిపోయిన తండ్రిముఖం వంక చూశాడు. "అదేమిటి బాబా? డబ్బు లేకపోయిందా?"

"నాకింక లేనిదేముంది నాయనా? నువ్వు వచ్చావు, అంతే చాలు."

"కాని నేను కిందటిసారి రెండువందల ఫ్రాంకులిచ్చివెళ్ళానుకదా?"

"అవును నాయనా, నువ్వు ఇచ్చావు. కాని మన పొరుగు కాదరూస్‌కి ఇవ్వవలసిన ఋణంమాట మరిచిపోయావు. అతను వచ్చి జ్ఞాపకం చేశాడు. ఋణం తీర్చకపోతే మోరెల్ వద్దకు వెడతానని బెదిరించాడు. నీకేమి అపకారం కలుగుతుందోనని భయపడి, నేను ఋణం తీర్చేశాను."

"ఏమిటి? నూటనలభై ఫ్రాంకులు కదా అతనికివ్వవలసింది? నేనిచ్చిన రెండువందల ఫ్రాంకుల్లోనూ అంత మొత్తం ఇచ్చేశావా?" వృద్ధుడు అవునన్నట్లు తలూపాడు.

"అంటే, మూడు నెలలూ అరవై ఫ్రాంకులతో గడిపావా! అయ్యో! తలుచుకుంటే గుండె బద్దలౌతోంది."

"అబ్బే, అదంతా ఇప్పుడెందుకు? నువ్వు క్షేమంగా తిరిగొచ్చావు. అంతే చాలు" అని వృద్ధుడు చిరునవ్వు నవ్వాడు.

"అవును, తిరిగి వచ్చాను, ఉజ్వల భవిష్యత్తుపై ఆశతో తిరిగి వచ్చాను. ఉండు బాబా, నువ్వు కొంత డబ్బు తీసుకో. ముందుగా అవసరమైన కొన్ని వస్తువులు కొని తెప్పించుకో" అంటూ యువకుడు తనవద్ద ఉన్న ధనమంతా తీసి మేజా మీద ఉంచాడు. డజను బంగారు నాణాలు, అరడజను క్రౌన్లు, కొన్ని చిల్లర నాణాలు ఉన్నాయి. "వెంటనే బజారుకు పంపి అవసరమైనవన్నీ తెప్పించుకుందాం బాబా. ఇవాళ హాయిగా గడుపుదాం. మళ్లీ రేపు కొంత ధనం వస్తుంది."

"తొందరపడకు నాయనా, ఒక్కసారిగా అన్నీ కొనెయ్యడం చూస్తే, వీటికోసమే నీకోసం ఇన్నాళ్లూ నేను బెంగతో నిరీక్షిస్తున్నానని లోకులు అనుకోగలరు సుమా!"

"అవును, అదీ నిజమే, నీయిష్ట ప్రకారమే కానియ్యి. కాని అన్నిటికంటే ముందు నీకు పరిచర్య చెయ్యడానికి నౌకరొకడు కావాలి బాబా, నువ్వు ఒంటరిగా గడపకూడదని

నా కోరిక. నేను చాటుగా కొంత కాఫీ, పొగాకు తీసుకొచ్చాను. అది నా సామానుతో రేపొస్తుంది. ఉండు ఎవరో వస్తున్నట్టున్నారు."

'అతడు మన పొరుగు కాడరూస్. నువ్వు వచ్చినట్టు విని, వస్తున్నాడనుకుంటాను."

"అవునవును" మెల్లిగా గొణిగాడు ఎడ్మండ్, "పలికేమాటొకటి, మనసులో ఉండేది మరొకటి. కానీలే. పొరుగువాడుకదా! తోచినప్పుడు సహాయంచేశాడు. అతన్ని సత్కరించడం మన ధర్మం."

ఎడ్మండ్ మాటలు ముగిసీ ముగియకముందే, కాడరూస్ ద్వారం వద్ద ప్రత్యక్షమైనాడు.

పాతికేళ్లుంటాయి. చిన్న గడ్డం పెంచాడు. దర్జీవృత్తి. కత్తిరిస్తున్న గుడ్డముక్క చేతబట్టుకునే వచ్చాడు.

"ఓహో ఎడ్మండ్! తిరిగి వచ్చావన్నమాట" చిరునవ్వుతో తెల్లని పలువరుస స్పష్టంగా కనపడింది.

"వచ్చాను, కాడరూస్. సెలవివ్వండి. మీకే సహాయం కావలసినా చెయ్యడానికి సిద్దంగా ఉన్నాను." అన్నాడు డాంటీ. కాని సత్కార వాక్యాలు అతని రూక్షభావాన్ని కప్పిపుచ్చలేకపోయినాయి.

"అహ. వొద్దులే. ఎవరి సహాయం అవసరంలేదు. ఇతరులకి నేనే సహాయం చేస్తుంటాను."

డాంటీకి కొంచెం వేడి తగిలింది. కాని ఇంతలోనే కాడరూస్ అందుకున్నాడు.

"అబ్బే. నీకిచ్చిన రుణం తీరిపోయింది. అది ఇరుగుపొరుగు ధర్మంకదా! అంతే, అది చెల్లు."

"బాకీ చెల్లిపోవచ్చు కాని కృతజ్ఞతా ఋణం తీరదు" అన్నాడు డాంటీ.

"ఆ! అదంతా ఇప్పుడెందుకులే. నువ్వు క్షేమంగా తిరిగొచ్చావు. కులాసాగా కాసేపు మాట్లాడుకుందాం. ఒక గుడ్డకోసం ఓడరేవుకి వెళ్లాను. అక్కడ డాంగ్లర్ కనిపించాడు. 'ఇప్పుడే తిరిగి వచ్చా'నన్నాడు. అయితే ఎడ్మండ్ ఏడని అడిగాను. 'తండ్రిని చూద్దానికి వెళ్ళాడనుకుంటా' నన్నాడు. సరే, పాతమిత్రుని చూద్దామని ఇలా తొంగిచూశాను."

"నిజంగానే నీకు మేమంటే చాలా శ్రద్ధ కాడరూస్" అన్నాడు వృద్ధుడు.

"కాదుమరీ! నిజాయితీ మనుషులు అట్టే కనిపించని ఈ రోజుల్లో, మీరంటే నాకు చాలా గౌరవం. ఏమిటోయ్! చాలా ధనవంతుడవైనట్టున్నావే!" అన్నాడు దర్జీ, మేజాపైనున్న డబ్బు వంక చూస్తూ.

డాంటీ నిర్లక్ష్యభావంతో,"ఏదో దేవుడిదయ. ఇది నా డబ్బుకాదు. నేను లేనప్పుడు బాబా ఇబ్బంది పడ్డాడేమోనని అడిగాను. లేదని నాకు నచ్చచెప్పడానికి, ఉన్నది పర్సు దులిపి చూపించాడు. అదేమిటి బాబా! అదక్కడే ఉంచావ్! తీసిదాచు. కాడరూస్‌కి డబ్బేమైనా అవసరం ఉంటే కొంత అప్పియ్యి పోనీ."



"అబ్బెబ్బే నాకేమీ ఒద్దోయ్" అన్నాడు కాడరూస్. "దేవుడిదయవల్ల నా వృత్తి ఇప్పుడు బాగానే ఉంది. అయితే మోరెల్‌తో బాగా సఖ్యత కుదిరిందన్న మాటేగా? నువ్వా గడుసుదనం నేర్చావులే!"

"మోరెల్ నన్నెప్పుడూ ఆదరిస్తాడు."

"మరైతే అతను విందుకి పిలిస్తే నువ్వు నిరాకరించావుట తప్పుకాదూ?"

"ఏమిటీ? విందు నిరాకరించావా?" ఆతృతగా అడిగాడా వృద్ధుడు. "ఏమిటి డాంటీ? అతను నిన్ను విందుకి ఆహ్వానించాడా? మరెందుకు నిరాకరించావు నాయనా?"

"వెంటనే నిన్ను చూడాలని బాబా. చూడందే నిలవలేపోయాను."

"మోరెల్ ఎంత నొచ్చుకుని ఉంటాడో! కెప్టెన్ అవాలని కోరుకుంటున్నవాడైతే, కొంచెం యజమానిని మెప్పించడానికి ప్రయత్నించాలి" అన్నాడు కాడరూస్.

"మెప్పించడానికి నేను ప్రయత్నించనక్కరలేకుండానే కెప్టెన్ అవ్వాలని ఆశ."

"అవునవును. అదీ బాగానే ఉందిలే, మంచిదే. నీ మిత్రులంతా సంతోషిస్తారు. ఈ శుభవార్త వింటే సంతోషించే వాళ్లు సెంట్‌నికొలాస్ కోటకవతల మరొకరుంటారని కూడా నా ఊహ."

వృద్ధుడు ప్రశ్నించాడు : "ఎవరు? మర్సిదా మాటేనా?" యువకుడన్నాడు "అవునుబాబా. నిన్ను చూశాను. నా బెంగతీరింది. ఇంక కాటలన్స్ నివాసానికి వెళ్ళాలనుంది బాబా. ఏమంటావు?"

"అవును నాయనా వెళ్లు. ఇటువంటి కొడుకునిచ్చి భగవంతుడు నన్ను కనిపెట్టాడు. అలాగే తగిన భార్యను కూర్చి భగవంతుడు నిన్నాశీర్వదిస్తాడు."

"భార్యా!" అని ఆశ్చర్యపడ్డాడు కాడరూస్. "అప్పుడే భార్య అంటున్నారేమిటి! అయినా, తొందరపడ్డం మంచిది డాంటీ. అపురూపసుందరి మర్సిదాపైన ఆసక్తి పెట్టుకుని డజనుమంది యువకులున్నారు."

"నిజమే" అన్నాడు డాంటీ, చిరునవ్వుతో. అయితే లోని తొందరపాటును అణుచుకోలేక పోయాడు.

"నిజమే." అన్నాడు కాడరూస్. "వాళ్లలో కొందరు ఎన్నదగిన వరులు కూడా ఉన్నారు. అయితే, నువ్వా కెప్టెన్ కాబోతున్నావు కాబట్టి నిన్ను నిరాకరించే ప్రమాదం లేదనుకో."

"అబ్బే. అలా అనకూడదు" అన్నాడు డాంటీ. "స్త్రీలంటే నా కింతకంటే మంచిభావం ఉంది. నేను కెప్టెన్ అయినా, కాకపోయినా, మర్సిదా నా పట్ల ఒకే ఆసక్తితో ఉంటుందని నా నమ్మకం."

"మరీ మంచిది! అయినా నా సలహా పెడచెవినిపెట్టకు. నువ్వు తిరిగి వచ్చినట్టు, ఆమె పైన నువ్వు ఆశలు పెట్టుకున్నట్టు వీలైనంత త్వరలో ఆమెకి తెలియపరచడం మేలు."

"అలాగే చేస్తాను" అంటూ డాంటీ, తండ్రిని ఒకసారి ఆలింగనం చేసుకుని బయలుదేరాడు. డాంటీ వెళ్లగానే కాడరూస్ బయలుదేరాడు. వెళ్లి వీధిమలుపులో వేచి ఉన్న డాంగ్లర్‌ను కలుసుకున్నాడు.

"అతన్ని చూశావా?" ప్రశ్నించాడు డాంగ్లర్. "కెప్టెన్ అవాలని కోరిక ఉన్నట్లు నీతో అన్నాడా?"

"అనడమేమిటి? అప్పుడే కెప్టెన్ అయినట్లే మాట్లాడుతున్నాడు! మోరెల్ అతనికి మాట ఇచ్చాడట."

"అసలు వాణ్ని ఇంకో మెట్టు దించెయ్యాలి. ఇంకా వాడికి ఆ యువతిని ప్రేమించే ఆశ ఉన్నట్టేనా?"

"ఉన్నట్టేనా ఏమిటి? వెర్రిప్రేమ. ఇప్పుడే చూడ్డానికి వెళ్లాడు. కాని–నేనాట్టే పొరపడ్డం లేదనుకుంటాను–అక్కడ ఆశాభంగం కలగవచ్చు."

"అంటే? అదేమిటో విశదంగా చెప్పు నాకు? ఆ అమ్మాయి గురించి కూడా పూర్తిగా చెప్పు?"

"ఏముంది? మర్సిదా పట్నానికొచ్చినప్పుడల్లా కాటలన్ యువకుడొకడు తోడు ఉంటున్నాడు. అతను పొడుగ్గా ఉంటాడు. నల్లని కళ్లు, గోధుమ ఛాయ. ఆమె అతన్ని బావ అంటుంది."

"అల్లాగా! అయితే ఆమెని చేసుకోవాలనేనా అతని ఉద్దేశం? అంతేనా?"

"లేకపోతే ఇరవైఒక్కేళ్ల యువకుడు పదిహేడేళ్ల యువతి వెంట ఎందుకు తిరుగుతాడు?"

"ఇప్పుడు డాంటీ కాటలన్స్ నివాసానికి వెళ్లాడని కాదూ చెప్పావు? మనం ఈ పక్కనించీ నడచివెడితే రిజర్వ్ హోటల్‌కి వెళ్లవచ్చు. ఒక గ్లాసు పుచ్చుకుంటూ కూచుంటే సరి. ఆ దారినే డాంటీ తిరిగి వెడతాడుగా! అప్పుడు ఏం జరిగిందో వాడి ముఖం చూసి చెప్పవచ్చు."

"అవును. అయితేనడు." ఇద్దరూ కలిసి గబగబా నడిచి హోటల్‌కి వెళ్లారు. పదినిమిషాల క్రితం డాంటీ ఆదారినే వెళ్లినట్లు హోటల్ యజమాని పాంఫైల్ కూడా చెప్పాడు. కాటలన్స్ నివాసానికే వెళ్లాడని నిర్ధారణచేసుకుని, ఇద్దరూ చెరొక గ్లాసు ద్రాక్షసారాయం తెప్పించుకుని హోటల్ ఆవరణలో వృక్షచ్ఛాయ క్రింద ఒక మేజావద్ద కుర్చీలో నిరీక్షిస్తూ కూర్చున్నారు.

## 3

మిత్రులిద్దరూ కూర్చున్న ప్రదేశం నుంచి కాటలన్స్ నివాసగ్రామం నూరడుగుల దూరం ఉంది. పూర్వం ఒకప్పుడు స్పెయిన్ నుంచి చిన్న పడవల్లో ఒక గుంపు వచ్చి ఇక్కడ చేరింది. వారిది కొత్త భాష. వారిలో స్థానిక భాష తెలిసిన ఒక నాయకుడు ఈ



ప్రాంతంలో వలస స్థిరపర్చుకోడానికి అనుమతి కోరుతూ, మార్సేయ్ కౌన్సిల్‌కు మహజరు పెట్టాడు. అది నమోదైన మూడుమాసాలలో అక్కడొక గ్రామం వెలిసింది. ఆ గ్రామం కొంత స్పానిష్‌రీతినీ, కొంత మూరిష్‌రీతినీ మేళవించి ఒక వింత అందం తెచ్చుకుంది. సముద్రంలోకి చొచ్చుకున్న ఆ నేలని విడిచిపెట్టకుండా ఆ గుంపు ఈనాటికీ అక్కడేవుంది. తాత ముత్తాతల ఆచార సంప్రదాయాలను, వేషభాషలనే అనుసరిస్తున్నారు. మూడు నాలుగు శతాబ్దాలైనా వారు ఇతరులతో వివాహ సంబంధాలు పెట్టుకోలేదు. భాష విశిష్టతనూ, జాతి విశిష్టతనూ నిలబెట్టుకున్నారు. ఆ గ్రామానికి ఒకే ఒక వీధి ఉంది. ఆ వీధిలో ఒకచిన్న ఇంట్లో... ఒకచక్కని యువతి గడప నానుకుని నిలబడి ఉంది. నాజూకైన వేళ్ళతో ఒక పూలగుత్తిని నలుపుతోంది. దేవతా ప్రతిమను చూసి చెక్కినట్లున్న ఆమె పొడుగైన చేతులు కంపిస్తూ, లోని ఆవేగాన్ని ప్రకటిస్తున్నాయి. ఆమెకు మూడడుగుల దూరంలో సౌష్టవశరీరుడైన ఒక యువకుడు కుర్చీలో కూర్చుని, ముందుకూ వెనక్కూ ఊగుతున్నాడు. అతని ముఖంలో ఓర్మిలేమి, చికాకు స్పష్టంగా గోచరిస్తున్నాయి. యువతిముఖంలోని నిశ్చలభావం, యువకుని ముఖంలోని సంశయాందోళనలను ఇనుమడింప చేస్తున్నది.

"మర్సిదా! వివాహముహూర్తాలు సమీపిస్తున్నాయి. సమాధానం చెప్పవా?" అన్నాడు యువకుడు.

"ఇప్పటికి నూరుసార్లు సమాధానం చెప్పాను ఫెర్నాండో. నన్ను మళ్ళీ మళ్ళీ అడుగుతున్నావంటే, నీపైన నీకే విశ్వాసం లేదన్న మాట."

"కావచ్చు! కాని ఇంకోమారు నేనామాటల్ని నమ్మగలిగేవరకూ చెప్పు. అయ్యో! నీ సాహచర్యంపొంది సుఖించాలని పదేళ్లు కలలుకని, చివరికి నా జీవితంలో ఈ ఏకైకలక్ష్యం చేకూరే ఆశ నశించేనా?"

"నేను మాత్రం అటువంటి ఆశకు తావివ్వలేదు ఫెర్నాండో. నేనెప్పుడూ నీకు చెప్తూనే వున్నాను నిన్ను సోదరునిగా భావించి ప్రేమిస్తున్నానని; నా హృదయం మరొకరికి అర్పితమయిందని. నేను నీకెప్పుడూ చెప్తూ ఉండలేదా ఫెర్నాండో?"

"అవును మర్సిదా! నిర్దయతో నిష్కర్షవాక్యాలనే నాకెప్పుడూ ప్రసాదించావు. కాని కాటలన్ జాతికి చెందినవాళ్లు అన్యజాతీయుల్ని వివాహం చేసుకోరాదనే నియమాన్ని నువ్వు మరిచిపోతున్నావు."

"అది ఆచారం మాత్రమే. నీ స్వార్థం కోసం ఈ ఆచారంతో నన్ను బంధించకు. సైన్యంలో చేరాలని నీకు ఆజ్ఞ వచ్చింది. నావల్ల నీకేం ప్రయోజనం? నాకే సంపదాలేదు, తల్లిదండ్రులు లేరు."

"నువ్వు. పేదవే; ఒంటరివే. అయితే మాత్రం? మార్సేయ్‌లో ఎంతటి భాగ్యవంతుల పుత్రికలైనా సరే, వారికంటె నువ్వే నాకు ఎన్నతగినదానవు. నీకు సమానమయిన మరొక యువతిని చూపించు?"

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=391**